


# మరవలేని మనిషి

మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఆదివారం కాబట్టి మేట్నీకి ఓ ఇంగ్లీష్ సినిమాకి వెళ్ళాను. క్యూలో నిలబడ్డాను అతని వెనక.

కాళ్ళ దగ్గర బ్రీఫ్‌కేస్ వుంది. ఇంగ్లీష్ నవలని చదువుతున్నా డతను. బుకింగ్ తెరిచాక చదవడం ఆపాడు.

వెనక్కి తిరిగి నన్ను చూసి వెంటనే నవ్వాడు "కులాసానా?" అడిగాడు ఇంగ్లీష్‌లో.

అతన్ని చూడటం అదే మొదటిసారి.

"మీ రెవరో నాకు తెలియదు." జవాబు చెప్పాను.

"మీరు ఆవారి తమ్ముడు కదా?" అడిగాడు.

తల అడ్డంగా వూపాను.

"కాదు."

"సారీ."

"ఇట్సాల్‌రైట్,"

మా ఇద్దరి సీట్లు పక్క పక్కనే. కూర్చున్నాక చెప్పాడు.

"అచ్చారి అని నా స్నేహితు డొకడు న్నాడు నాగ్‌పూర్‌లో. ఓసారి అతని బ్రదర్ హైద్రాబాద్ నించి వచ్చాడు. అచ్చం మీలాగే వున్నాడు... మీ పేరు?"

చెప్పాను.

"నా పేరు జీతూ జీతూ అగర్వాల్. నాగ్‌పూర్‌లో పళ్ళవ్యాపారం చేస్తున్నాను నెలకోసారి ఆ పనిమీద వస్తుంటాను." చెప్పాడు.

"నేను షెహన్‌సా కాంట్రాక్టర్స్ కంపెనీలో పనిచేస్తున్నాను." చెప్పాను.

సినిమా థియేటర్‌లో లైట్లారిపోయి తెరమీద స్లయిడ్స్ కనబడేదాకా చేతి లోని పుస్తకం చదువుతూండిపోయాడు అతను.

ఇంటర్వెల్‌లో కేంటీన్‌దగ్గర కనప డ్డాడు మళ్ళీ జీతూ. నా కూడా ఓ టీ తీసుకున్నాడు.

మొహమాటపడుతూనే తీసుకున్నాను.

"బాగా మబ్బుపట్టింది. వర్షం వచ్చే టట్లుగా వుంది," అన్నాడు ఆకాశంవంక చూసి.

"సిగరెట్ తాగుతారా?" అడిగాను టీ తాగాక సిగరెట్ దుకాణంవైపు నడుస్తూ.

జేబులోంచి గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ పెట్టె తీసి నాకో సిగరెట్ ఆఫర్‌చేసి తనొకటి వెలిగించాడు. పొగ గుండెల నిండా పీల్చి వదులుతూ అడిగాడు.

"సినిమా అయేక మీ కేమయినా పని వుందా?"

"ఎందుకు?"

"రాత్రి పదిన్నరకి దక్షిణ్ ఎక్స్ ప్రెస్‌లో వెళ్తున్నాను. వర్షం వస్తే సరదాగా విస్కీ తీసుకుందా మనుకుంటు న్నాను. కంపెనీ లేకుండా తీసుకోవటం కష్టమే. మీకు అలవాటుంటే సరదాగా కంపెనీ ఇవ్వగలరా?" మర్యాదగా అడిగాడు.

తలవూపాను. నా జేబులో ఇరవై రూపాయలున్నాయి. వర్షం వచ్చే పక్షంలో అతని ఆలోచన మంచిదనిపిం చింది.

సినిమా అయేక బయటకి వస్తే సన్నగా తుంపరలు పడుతున్నాయి.

"వెళ్దామా?" మొహమాటపడుతూనే అడిగాడు జీతూ.

తల వూపాను.

"థాంక్స్."

దగ్గరలో వున్న ఓ బార్‌కి వెళ్ళాం. బేరర్ వచ్చాక అడిగాడు నన్ను.

"మీరు నా గెస్ట్. ఏం కావాలో చెప్పండి"

"మీరు?"

"బీరు తీసుకుంటాను నేను."

బేరర్‌కి కేజునట్స్ కూడా తీసుకు రమ్మని చెప్పాడు జీతూ.

"మీ వూరు బావుంటుంది" చెప్పాడు.

నేను అట్టే మాట్లాడలేదు. అతనే పళ్ళ వ్యాపారం గురించి, నాగ్‌పూర్ గురించి, అక్కడ వున్న మహారాణిబాగ్ గురించి, తన కుటుంబం గురించీ అనేకం మాట్లాడసాగాడు.

పావుగంటలో నా బీరుసీసా ఖాళీ అయింది. ఇంకొకటి ఆర్డర్ చేసాడు.

మరో అరగంటలో అది కూడా పూర్తయింది. తనకో క్వార్టర్ విస్కీ నాకో బీరు చెప్పాడు బేరర్‌ని పిలిచి.

"ఇంక వద్దండి," చెప్పాను. నా జేబులోని ఇరవై రూపాయల విలువని మించి తాగదలచుకోలేదు. నా బిల్లు నేనే ఇవ్వదలచుకున్నాను.

జేబులోంచి పర్సు తీసి తెరచి చూపించాడు జీతూ నవ్వుతూ.

పది రూపాయల నోట్లు చాలా వున్నాయి అందులో.

"లేదనుకోకండి. మీరు నా గెస్ట్. రైలుకి ఇంక చాలా సమయం వుంది."

మూడో బీరు పూర్తయ్యేసరికి బాగా విషా వచ్చింది నాకు.

"బాత్‌రూంకి వెళ్ళొస్తాను."

తల వూపాడు.

టాయ్‌లెట్‌కి వెళ్ళి రెండు మూడు నిముషాల్లో బయటకి వచ్చాను.

జీతూ లేడు.

బాత్‌రూంకి వెళితే నాకు ఎదురుపడి ఉండాలి వారిలో. బార్ అంతా చూసాను. ఎక్కడా కనపడలేదు.

ఓ కొత్త వ్యక్తి కేవలం కంపెనీ కోసం ముక్కూ మొహం తెలియని నాకు ఎందుకీ ఖర్చుపెటాలి అన్న సంశయం నాలో ఎప్పుడో మొదలయింది.

లేచి అతని పక్క సీట్ మీద వుంచిన బ్రీఫ్‌కేస్ వుందో లేదో చూసాను.

ఉంది.

దాదాపు ముప్పావుగంట అయింది. జీతూ మళ్ళీ రాలేదు.

బేరర్‌ని పిలిచి అప్పటికే నాలుగైదు సార్లు అడిగాను అతన్ని గురించి. తనకి తెలియదన్నాడు.

లేచివెళ్ళి జరిగింది బార్ మేనేజర్‌తో చెప్పాను.

"మీ దగ్గర డబ్బులేదా?" అడిగాడు నావంక అనుమానంగా చూస్తూ.

"లేదు. అతను బ్రీఫ్‌కేస్ వదిలి వెళ్ళాడు. తప్పక వస్తాడు. నేను వెళ్ళాలి."

కౌంటర్ వెనకనించి లేచి ఆ బ్రీఫ్ కేస్ దగ్గరికి వెళ్ళాడు. దాన్ని తెరచి లోపలకి చూసి నా దగ్గరకి తీసుకొచ్చి చూపించాడు మేనేజర్.

ఖాళీ!

"దీని ఖరీదు ఇరవై కూడా వుండదు."

నా మొహం పాలిపోయింది వెంటనే.

బార్ మూసేదాక, రాత్రి పదకొండు దాకా చూసాను.

జీతూ వస్తాడనుకోలేదు.

రాలేదు కూడా.

నా వుంగరం మేనేజర్‌కి ఇచ్చి బయటకి నడిచాను. దాన్ని తిరిగి తీసుకోవాలంటే జీతం వచ్చేదాకా ఆగాలి.